


# సర్పశిల

## - భువనచంద్ర



*(గత సంచిక తరువాయి)*

ఇప్పటి వరకూ జరిగిన కథ

*ఓ అడవిలోనున్న ఆలయం దగ్గర మొదలైన కథ, 'రాబీ వెబ్‌స్టర్ ' అనే అమెరికన్ ఇండియాలో దిగడంతో ఓ మలుపు తిరుగుతుంది. 'తక్షపురం 'లోని సర్పశిల ఒక మలుపుకి సంకేతమైతే 'నల్లమల 'లో జరిగిన విశ్వశాంతి యజ్ఞం మరో మలుపు. ఒక వైపున కొన్ని శక్తులు ప్రకృతి విధ్వంసానికి రచన చేస్తూంటే మరోవైపు ప్రకృతి రక్షకులు ప్రకృతిని కాపాడే ప్రయత్నాలు ముమ్మరం చేస్తుంటారు. అనేకానేక పాత్రలు తమ విధిని నిర్వర్తిస్తూవుంటాయి. అందరి లక్ష్యమూ ఒకటే - విశ్వశాంతి.*

**అది నిశ్చయంగా పట్టపగలే.** కానీ చిమ్మ చీకటి కమ్మినట్లుంది. అప్పుడప్పుడు పక్షులు భయంగా కూస్తున్నాయి. ఆకాశమంతా నల్లని మబ్బుల్తో నిండిపోయింది. హోరుగాలి ఎంత వీస్తున్నా మబ్బులు మరింత దట్టంగా కమ్ముకుంటున్నాయేగానీ దూరం జరగడంలేదు.

"సకలం సిద్ధం గురువర్యా" అన్నాడు కాలనేమి. అతడి అసలు పేరు కామేశ్వర శర్మ. కాలనేమి అనేది గురువు ఇచ్చిన నామం. అతని వెనక పద్దెనిమిది మంది శిష్యులు భక్తిగా దండలూ, పువ్వులూ పూజా సామగ్రి పళ్ళాలతో పట్టుకుని ఉన్నారు. తల పంకించాడు పింగళుడు.

అతని ఎదురుగా ఒక మహా విగ్రహం 'సజీవమా' అన్నట్టుగావుంది. ఆ విగ్రహం తలకు రకరకాల యీకలు గుచ్చి ఉన్నాయి. అవి కిరీటంలా కనిపిస్తున్నాయి. ఆ విగ్రహానికి ఒక చేతిలో బరిసె మరో చేతిలో గద్ద ఉన్నాయి. దాని నడుము చుట్టూ ఒక పాము చుట్టుకుని ఉంది. ఎర్రటి పాము.

ఆ విగ్రహం పాదాల దగ్గర ఒక కాకి, రెండు పుర్రెలు ఉన్నాయి. ఇవన్నీ విగ్రహంలోనే చెక్కబడి ఉన్నాయి. పాముకి ఎరుపు రంగు ఎలా వచ్చిందో తెలీదు. గద్ద, కాకి అంత సజీవంగా ఎలా ఉన్నాయో, ఎవరు మలిచారో అసలే తెలీదు.

ఆ విగ్రహపు ముఖం అత్యంత భయానికంగా ఉంది. పింగళుడు ఆవాహన చేశాడు. విగ్రహం మరింత మరింత సజీవంగా క్రూరంగా కనిపిస్తోంది. విగ్రహపు కళ్ళు సూటిగా చూస్తున్నట్లున్నాయి. ముక్కులు శ్వాసిస్తున్నట్టూ కదులుతున్నాయి. క్షణక్షణానికీ విగ్రహం శిలా రూపం నుంచి మనిషి రూపంలోకి మారుతోందా అనే భ్రమ కలిగింది పింగళుడికి. ఆ విగ్రహం ఎదురుగా ఓ అగ్ని గుండాన్ని సృష్టించారు శిష్యులు. ఆ మూలికలు, కట్టెలు ఎక్కడివో, ఎలా సేకరించారో తెలీదు. ఒక పక్క భుగ భుగా మంటలు, మరో పక్క దట్టంగా పొగ. దట్టమయిన మబ్బులాంటి పొగ. ఆ మబ్బులాంటి పొగలో ఆ విగ్రహం తేలుతోందా అన్న భ్రమ కలుగుతోంది. లక్ష జపం చెయ్యాలి. ఆ జపం సాత్విక దేవతోపాసనకి సంబంధించింది కాదు. క్షుద్ర దేవతోపాసన.

"దేవతలలో సాత్వికులు క్షుద్రులు ఉంటారా?" పింగళుడు తన సోదరుడు కర్కోటకుని చిన్నప్పుడు అడిగిన ప్రశ్న గుర్తొచ్చింది.

"దేవతలూ మానవులూ వానరులూ, రాక్షసులూ, నాగులు, యక్షులూ, కిన్నెరులూ, కింపురుషులూ, గంధర్వులు అందరూ మనుషులే. మనుషులమే. మనం పాటించే పద్ధతుల్లోనే తేడాలు. సాత్వికమయిన భావన ఎంత గొప్పదో 'క్షుద్ర ' భావన కూడా అంతే గొప్పది. పింగళా, సాత్వికతకి పెద్ద శ్రమపడనక్కరలేదు. విత్తనాన్ని నాటితే మొక్క మొలుస్తుంది. కొంచెం నీళ్ళు పోస్తే మహా వృక్షంగా రూపు దిద్దుకుంటుంది. అదే, ఆ వృక్షాన్ని ముక్కలుగా నరకాలంటే? ఎంతో చెమటోడ్చాలీ, ఎంత ఏకాగ్రత పట్టుదల కావాలీ? సత్వ గుణ సంపన్నులయిన దేవతల రూపు వేరు. ఆ హారం వేరు. ఆహార్యం వేరు. అదే క్షుద్రదేవతల రూపూ ఆహారం, ఆహార్యం అన్నీ వేరుగా ఉంటాయి. నైవేద్యం వేరు. పూజాక్రతులు వేరు. ఓ కుందేలుకి భూమిలో దొరికే ఓ దుంప ఆహారంగా సరిపోతుంది. మరి ఓ పులికి? దుంపని ఆహారంగా స్వీకరిస్తుందా అదీ? దానికి ఆహారంగా కుందేళ్ళు కావాలి. లేళ్ళు కావాలి. దున్నలో దుప్పులో కావాలి" నవ్వి చిన్నగా చిన్న తమ్ముడికి వివరించాడు కర్కోటకుడు.

"అన్నా.. ఈ ఉపాసనలు నిరంతరం ఇలా సాగిస్తున్నాము. క్రోధాన్నో, ద్వేషాన్నో ప్రజ్వలింపజేస్తున్నాం. దీనివల్ల అనంతమైన శక్తిని సంపాయించి లోకహితానికి కాక హింస కోసమే శక్తిని వ్యయ పరుస్తున్నాము. ఇది అవసరమా?" అడిగాడు పింగళుడు.

"పింగళా.. యీ సృష్టిలో ప్రతి జీవీ ప్రత్యేకమైనది. ప్రతి జీవికీ నిర్దుష్ట ప్రణాళిక ఉంది. ఒక మహా రథం కదలాలంటే కొన్ని వేల భాగాలతో ఆ రథాన్ని నిర్మించాలి. ఈ లోకం అనే రథం కదలడానికి కూడా అంతే ప్రయాస అవసరం అవుతుంది. మంచి చెడుల సమతుల్య రూపమే సమాజం. ఏది మంచి? ఏది చెడు? అనేది నిర్ణయించేది మానవుల బుద్ధికాదు. అది నిర్ణయించవలసినదీ నిర్ణయించేదీ 'కాలం' ఒక్కటే. ఆ కాలం సర్వ స్వతంత్రంగా

కనబడుతున్నా, దానికీ ఓ నియంత్రణ ఉంది. అందుకే, నీ కర్తవ్యాన్ని నువ్వు నిర్వహించు. సందేహాలు ఎప్పుడు సమాధానంతో సంతృప్తి చెందవు" అనునయంగా అన్నాడు కర్కోటకుడు. కాసేపు మౌనంగా ఉన్నాడు పింగళుడు.

"అసలీ మంత్రాలకు శక్తి ఉందా?" పసిపిల్లాడిలా అడిగాడు.

"ఒక మంత్రాన్ని ఉచ్చరించాలంటే కొన్ని వేల నరాల కదలికలతో మాత్రమే సాధ్యపడుతుంది. మొదటిది ఆకాశం. అంటే, సృష్టికి అవకాశాన్ని ఇచ్చేది. ఆకాశంనించి మొట్టమొదటిగా పుట్టిన శక్తివాయువు. వాయువుకి ఉండే శక్తి అనంతం. సర్వజీవులలోనూ అణువణువునా సంచరిస్తూ సృష్టి – స్థితి – లయ కార్యక్రమాల్ని జరిపిస్తున్నది వాయు శక్తే, వాయువుని పక్కన పెడితే, సృష్టే శూన్యమవుతుంది. ఆ వాయువుని మనిషి తన మేధ చేత మధించి మధించి సృష్టించినవే మంత్రాలు.

మంత్ర శక్తి అమోఘం, అద్భుతం, అప్రతిహతంగా. పింగళా మన 'నాగు'లకు వంశపారంపర్యంగా వచ్చిన మంత్రాలు మహా రహస్యాలు. అవి ఎన్నటికీ రహస్యాలుగానే ఉండిపోయేట్టుగా నిర్మించారు మన పూర్వీకులు" ఓ క్షణం ఆగి తన పూర్వీకుల్ని తలచుకుని మనసులోనే నమస్కరించుకున్నాడు కర్కోటకుడు. పింగళుడు శ్రద్ధగా వింటున్నాడు.

"మానవ జాతి అనేక జాతుల సమూహం. ఎవరి జీవన శైలి వారిది. ఎవరి విజ్ఞానం వారిది. ఎవరి ఆహార విహారాలు వారివి. మనం నాగజాతి వారం. కశ్యపుడు మన మూల పురుషుడు. ఆయన భార్య కద్రువ.. సంఖ్యలో మూడవ భార్య. అతని సంతానం వాసుకి, తక్షకుడు, అనంతుడు, నేను అంటే కర్కోటకుడుని, తరవాత కాళియుడు, పద్మ, మహా పాదుడు, శంఖుడు, చివరగా పింగళుడు అనే నువ్వు జన్మించారు" ఆగాడు కర్కోటకుడు.

"అదేమిటీ?" ఆశ్చర్యంగా అన్నాడు పింగళుడు.

"నీ ఆశ్చర్యం నాకు అర్ధమయింది. ఇప్పటి కశ్యపుడు కద్రువ కాల ప్రవాహంలోని 116వ తరం వారు. కాలం మారినా పేర్లు అవే ఉంటాయి. పింగళా, నువ్వూ నేను కూడా 116వ తరం కశ్యపు కద్రువలకు పుట్టిన సంతానమే. అయితే తక్షకుడు, కాళియుడు, మహాపాదుడు నర రూపంలో లేరు. శిలా రూపంలో ఉన్నారు. నరరూపం సిద్ధించాలంటే మనము ఈ ఉత్కృష్టమైన పూజని పూర్తిగావించాలి" అన్నాడు కర్కోటకుడు.

"ఎందుకలా జరిగిందీ?" అడిగాడు పింగళుడు.

“నాయనా, ఇది ఇప్పటి కథ కాదు. కొన్ని తరాలుగా చర్విత చరణమౌతున్న కాలపు కథ. ముందు యీ పూజ పూర్తి చేసి, యజ్ఞాన్ని మొదలు పెట్టు. ప్రస్తుతం నీకు కావలసింది కథా కుతూహలం కాదు.. అప్రతిహతంగా ఏకాగ్రత" సంభాషణకి ముగింపు పలికాడు కర్కోటకుడు.

“ఇదే సుముహూర్తం అన్నట్టుగా ఫెటీల్న ఉరిమింది ఓ ఉరుము. కళ్ళు మిరుమిట్లు గొనిపేలా వేలాది మెరుపులు మెరిసాయి.

మహా విగ్రహపు నోరు వికృతంగా తెరుచుకున్నట్లనిపించింది పింగళుడికి. ఎర్రటి పాము యొక్క నల్లని కనుగుడ్లు భయంకరంగా గుండ్రంగా తిరిగినట్టు అనిపించి ఒళ్ళు జలదరించింది పింగళుడికి.

❦❦❦

కద్రువ.. కర్కోటకుడూ, పింగళుడూ చేస్తున్నపని సరికాదు. ఎప్పుడో జరిగినదానికి ఇప్పుడు ప్రతీకారం తీర్చుకోవడం సరైన పని కాదు. వారిని వారించు. ఆనాడు జరగాల్సిన అనర్థం ఆగింది. ఇప్పుడు మళ్ళీదాన్ని తవ్వి తలకెత్తుకోవటం మంచిదికాదు" అన్నాడు కశ్యపుడు. 115 తరాలనించీ వారి కుటుంబంలోని పేర్లు అలాగే వస్తున్నాయి. పుట్టిన బిడ్డకి 'కశ్యప' అనే పెడతారు. అతడికి వచ్చే భార్య పేరు ఏదైనా సరే, కద్రువ అనే మారుస్తారు. పుట్టిన పిల్లల పేర్లు అప్పటి పేర్లే పెడతారు. ఇది ఆనాటి కశ్యప మహాముని కోర్కె కాదు. కద్రువ పెట్టిన నియమం.

"స్వామీ మన శరీరాలు మారుతున్నాయేగానీ ఆత్మలు మారలేదుగా? అందుకే యీ పగ. ఈ పగ చల్లారదు. కర్కోడకుడు సౌమ్యుడు. మహా తపఃశ్శక్తి సంపన్నుడయినా, హింసను రగల్చడం ఇష్టంలేక పింగళునిచే యజ్ఞం చేయిస్తున్నాడు. అలాగే కానీయండి" కళ్ళల్లో క్రోధం. కశ్యపుడు మాట్లడలేదు.

లోకంలో జరుగుతున్న విచిత్రాలు అతడూ గమనిస్తూనే ఉన్నాడు. కద్రువ చెప్పినట్లు నాగ శరీరాలు మారుతున్నాయేగానీ ఆత్మలు మారడంలేదు. అయితే ఆ గత జన్మ తాలూకు గుర్తు నిరంతరం వారికి ఉండదు. నాగుల చవితి, నాగ పంచమి రోజుల్లో మాత్రమే గుర్తుకొస్తుంది. మిగతా రోజుల్లో మాములు మనుషులే. ఆ రోజు నాగపంచమి.

"సర్పం క్రూరమైనది కాదు కద్రువా. సర్పాలు సృష్టిలో భాగాలు, సర్పాలు లేకపోతే మానవులు పడించే పంట అంతా ఎలుకల పాలవుతుంది. అవేకాదు కప్పలూ లక్షలాది సూక్ష్మ జీవుల్ని మింగి యీ లోకంలో జనులకు మేలు చేసే ఆ సూక్ష్మజీవుల్ని నిశ్శేషం చేస్తాయి. కద్రువా నీ పగని చల్లార్చుకో. ఇప్పటికైనా నీ విరోధం మాని పింగళుడి యజ్ఞాన్ని మానిపించు. వాళ్ళు చిన్నతనం నించీ నీ దగ్గరే పెరిగారు కనక. నా మాట వినరు" అనునయంగా అన్నాడు కశ్యపుడు. కద్రువ ఏమీ మాట్లాడలేదు. గాఢంగా నిట్టూర్చి కశ్యపుడు వెళ్ళిపోయాడు.

❦❦❦

మంటలు భయంకరంగా వ్యాపించి నగరాన్ని దగ్ధం చేస్తున్నాయి. కారణం తీవ్రవాదులు అనేక చోట్ల విసిరిన పెట్రోల్ బాంబులు. బస్‌స్టాండ్లు, రద్దీ ఉండే రోడ్డుపక్క ఇడ్లీ బళ్ళతో సహా వారు ఏ చోటునీ వదలలేదు. కొన్ని స్కూళ్ళ మీద

విసిరారు. అదృష్టవశాత్తూ పిల్లలకి ఏమీ కాలేదు కానీ వృద్ధులూ, స్త్రీలూ వందల సంఖ్యలో తీవ్రంగా గాయపడ్డారు. మృతుల సంఖ్య తెలీదు.

"హింసవల్ల జరిగే ప్రయోజనం ఏమిటీ, మనిషి తన బుద్ధిని వినియోగించడం మానుకున్నాడా? అసలు మనిషి బతికేదెంతకాలం? ఈ చిన్న జీవితాన్ని ఇలా ఛిన్నాభిన్నం చేసుకోవడం ఎంతవరకూ సబబూ? మతాల కోసం హత్యలు కులాల కోసం హత్యలు అధికారం కోసం హత్యలు, అహంకార ప్రదర్శనకి హత్యలు, పదవి కోసం హత్యలు, పరువు కోసం హత్యలు, రాజకీయ పార్టీల కోసం హత్యలు, విలాసాల కోసం హత్యలు.. మనిషి మృగంగా మారిపోయాడా? గుడికి వెళ్ళే భక్తులు రోజు రోజుకీ పెరుగుతున్నారు. బడికి వెళ్ళే విద్యార్థులు  పెరుగుతున్నారు. ప్రవచనాలు వినే ప్రేక్షకులూ అనంతంగా పెరుగుతున్నారు. మరి మానవత్వం ఎందుకు పెరగడంలేదూ? యుగాలుగా భగవంతుడా ఇదా నీ సృష్టీ" బాధగా. చెమర్చిన కళ్ళతో అన్నాడు పరమేశ్వర శాస్త్రిగారు.

"అహింస ఎంత సనాతనమో హింస కూడా అంతే సనాతనం శాస్త్రిగారూ! కాలం యుగాలుగా  విభజించబడింది. ఆ విభజన మనం చేసేది కాదు. ఒక్కో యుగానికి ఒక్కో ధర్మం అది మంచిదైనా, ఘోరమైనదైనా మనం యుగ ధర్మాన్ని తలదాల్చక తప్పదు. ఈ హింసవల్ల జరిగేది ఏమిటో తెలుసా? మరింత హింస. మరింత రక్తపాతం.. మరింత భయానక సృష్టి భయాన్ని మించిన ఆయుధం మరెక్కడైనా ఉందా? ఆ భయాన్నే మనమీద ఆయుధంగా ప్రయోగిస్తున్నారు. ఒకప్పుడు బాణాలు, శూలాలు, బరిసెలు, కొడవళ్ళు, గొడ్డళ్ళు, పోట్ల కత్తులూ, కైజారులు ఇవే ఆయుధాలు. ఇప్పుడు అణ్వాస్త్రాలు. కొన్ని దేశాలు సమకూర్చుకున్నాయి. వాటిని చూపిస్తూ అవిలేని దేశాల్ని భయపెడుతున్నాయి. ఎక్కడో ఎప్పుడో జనాల్లో నిండిపోయిన ఆ 'భయం' ఓ అణ్వాస్త్రమై పేలుతుంది. ఏ బలవంతుడూ నిలవడు. భూలోకంలోంచే మళ్ళీ పునఃసృష్టి ప్రారంభంవుతుంది" నిర్లిప్తంగా అన్నాడు రామజోగి.

చీకట్లు పడుతున్నాయి. టి.వీ చూడటానికి కూడా ప్రజలు భయపడుతున్నారు. ఏం చూడాల్సి వస్తుందో ఏం వినాల్సి వసుందో అని.

"అణ్వాస్త్రాలు ఏయే దేశాల్లో ఉన్నాయో మనకి తెలుసు. ఎన్ని ఉన్నాయో కూడా మనకి సుమారుగా తెలుసు. విద్రోహ శక్తులు ఎక్కడున్నారో, ఎందరున్నారో కూడా ప్రభుత్వానికి తెలుసు. మరి ఇన్ని తెలిసి మేధావి వర్గం ఎందుకు నిశబ్దంగా ఉందీ? రాబోయే అనర్ధం తెలిసికూడా మనుషులు ఎందుకు తమకేమీ పట్టనట్లు ఉంటున్నారు?" రాంజోగి వంకచూస్తూ అడిగాడు శ్రీనివాస్.

"సామాన్యుడు ఎప్పుడూ శాంతి కాముకుడే, ఉండటానికి చోటు, తినడానికి తిండి, కట్టుకోవడానికి బట్ట, జీవితానికి కావలసిన కనీస అవసరాలూ ఉంటే చాలు. సంతృప్తిగా కాలం వెళ్ళదీస్తాడు. ఏవో చిన్న కోరికలు తప్ప ప్రపంచాన్ని ఏలెయ్యాలని ఏనాడూ కలలు కనడు. జీవితం చల్లగా గడిచి పోతున్నంత కాలం రాజెవడో మంత్రి ఎవడో కూడా పట్టించుకోడు. శ్రీనివాసా! లోకానికి వీరివల్ల జరిగే నష్టం ఏదీ ఉండదు. అది రామాయణమైనా, మహాభారతకాలమైనా. లోకానికి  నష్టం జరిగేది అత్యాశ కలిగిన మేధావుల వల్ల. వీరు చాలా తెలివిగా ఓ నూతన ఆలోచనని ఆవిష్కరిస్తారు. కొందరు ఆ ఆలోచనకి వశులై వారిని అనుసరిస్తారు. కొందరైతే వారిని కారణ జన్ములుగా భావించి దాసాను దాసులవుతారు. కొందరు ఆ మేధావుల ఆలోచనలను సోదాహరణంగా వ్యతిరేకిస్తారు. దాంతో జనాలు రెండుగా విడిపోతారు. పైవాళ్ళు బాగానే ఉంటారు. ఎటొచ్చీ కొట్టుకు చచ్చేది సామాన్యులే. కొట్టుకోవడానికి కారణాలు లక్షా తొంభై. 'నీ ముత్తాత తాత మా తాతని కొట్టాడని ఒకడు పురాణ వైరాన్ని వెలికి తీస్తాడు. మా కులం గొప్పదంటే మా కులం గొప్పదని మరొకడు ఉపన్యాసాలిస్తాడు. ప్రజలు ఆవేశంతో ఊగిపోతారు. నిన్నటి వరకూ లేని వైరాన్ని యీనాడు తలకెత్తుకుంటారు.  కొందరైతే నాయకుల కోసం కాళ్ళూ, చేతులూ పోగొట్టుకుని వికలాంగులైతే, మరి కొందరు తలపైనా ఒంటి మీదా కిరసనాయిలు పోసుకుని తమ నాయకుల కోసం ఆత్మాహుతికి పాల్పడతారు. వాళ్ళకోసం వీళ్ళెందుకు చావాలి? వీళ్ళకోసం వాళ్ళెందుకు చావరూ? ఇవన్నీ జవాబులేని ప్రశ్నలే. శ్రీనివాసా, జరిగేదాన్ని గమనించడం తప్ప, ప్రస్తుతానికి మనం చేసేది ఏమీ లేదు. ఇది నేను వేదాంత పరంగా చెప్పడం లేదు. సంఘటనలను సమీక్షించి చెబుతున్నా" అన్నాడు రామజోగి.

ఎవరూ ఏమీ మాట్లాడలేదు. ఆలోచిస్తున్నారు. అణ్వస్త్రాలు ఉపయోగిస్తే ప్రపంచం ఏమవుతుంది? ఒక్క హిరోషిమా నాగసాకి పై ప్రయోగించిన అతి చిన్న అణ్వాయుధాలు అంత పెద్ద ఘోర ప్రభావాన్ని చూపితే, ప్రస్తుత ఆయుధాలు ఎంత ప్రభావాన్ని చూపుతాయో?

"యుద్ధాలు వచ్చేది పాలకుల అహంకారాలవల్ల. సామాన్యుడు ఏనాడూ యుద్ధాన్ని కోరుకోడు. సైన్యము యుద్ధాన్ని కోరుకోదు" అన్నాడు శ్రీనివాస్.

"పరువు కోసం యుద్ధాలు, అత్యాశ తీర్చుకోవడం కోసం యుద్ధాలు – ధర్మం నిలపడం కోసం యుద్ధాలు. ఆ ధర్మాన్ని శిక్షించడం కోసం యుద్ధాలు – ఏ యుద్ధమైనా ముగిసేది రక్తపాతంతోనే, జన నష్టంతోనే! అయినా పాలకుల ఆలోచనా సరళి మారదు. అహంకారాలు మానవు. బహుశా మనిషికి హింస మీద వున్న ఉత్సుకత అహింస మీద లేదేమో!" అన్నది శరద్వతి.

" ఆ విషయం లోకానికి తెలిసిందేకదా! ఎంతమందిని చంపితే అంత గొప్ప వీరుడిగా యుగయుగాల నించీ ప్రపంచం గుర్తిస్తూనే ఉందిగా. ఎంత ఎక్కువమందిని చంపితే అంత పెద్ద పతకాలు లభిస్తాయి. వారి పేరు చరిత్రలో లిఖింపబడుతుంది. మంచివాడిని ఎవరూ గొప్పగా మన్నించరు, అనుసరించరు. వాళ్ళు చెయ్యమన్నదాన్ని కిమ్మనకుండా చేస్తారు. లోకాన్ని ఇవాళ శాసిస్తున్నది డబ్బు కాదు...భయం" అన్నారు శాస్త్రిగారు.

దీపాలు వెలిగించి చాలాసేపయింది. కానీ ఎవరి మనసూ భోజనం మీదకి మరలలేదు.

"జయ్, రాబీ మిగతా వాళ్ళు రాబోతున్నారని కబురు వచ్చిందిగా. వీళ్ళు చాలామంది ఉంటారు. ఏర్పాట్లు చెయ్యడం కష్టమేనేమో" అన్నారు డాక్టరు గారు.

"ఓ అయిదారు రూములు హోటళ్ళలో బుక్ చేద్దాం. సమావేశాలు మాత్రం విడిగా పెట్టుకుందాం. సమావేశాలు, సమాలోచనలూ ఎక్కడ జరగాలో ప్లాన్ చెయ్యడం అతి ముఖ్యం" అన్నారు యజ్ఞప్ప.

"అవును. నార్త్ ఇండియన్సూ, విదేశీయులు కూడా ఉన్నారటగదా!" అన్నాడు శ్రీనివాస్.

"ఈ సమావేశం వల్ల ఏం లాభం ఉంటుందీ? మహా అయితే జరిగిన అనర్థాలని కలబోసుకోవడం జరుగుతుంది. అంతేగా!" అన్నది శరద్వతి.

"నిజం చెబితే అంతే. కానీ అమ్మా, ఏ క్షణం ఏ రహస్యాన్ని తనలో దాచుకుందో ఎవరికి తెలుసూ!"

చిన్నగా నవ్వి అన్నాడు యజ్ఞప్ప.

'షౌకత్' సౌధం సర్వాంత సుందరంగా అలంకరింపబడింది. పిల్లవాడికి నామకరణం జరగడానికి మరో 2 గంటల సమయం ఉంది. బంధు మిత్రుల రాకతో షౌకత్ శోభాయమానంగా వెలిగిపోతోంది. నిరాశ్రయులైన వారందరికీ భోజనాలు షౌకత్‌నించే పెద్ద పెద్ద గుండిగలతో, పాత్రలతో పంచబడుతున్నాయి. 'షగున్' ముఖం నిండా చిరునవ్వులే.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments